
సాక్షి
ఒడిశా

మంగళవారం । 28 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,67,560లు, బంగారం 1 గ్రాము 800 మిల్లీగ్రాములు, వెండి 44 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

ఒడిశా కార్మికుడి మృతి

మద్దిలోని ఇటుక బట్టీలో పని చేస్తున్న ఒడిశాకు చెందిన హేమంత్ భుయ్(27) అనే కార్మికుడు మృతి చెందాడు.



- 8లో.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గజపతి జిల్లా అడవ పోలీస్‌స్టేషన్ పరిధిలో అడవ సెంటర్ వద్ద సోమవారం ఒక బైక్, ట్రాక్టరును ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.

- 8లో.

న్యూస్‌రీల్

రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటన

భువనేశ్వర్: రాష్ట్రంలో 4వ దశ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల కోసం ప్రచారం చేయడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఈ వారం మళ్లీ రాష్ట్ర పర్యటనకు విచ్చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 29న రాష్ట్రంలో పర్యటించి మధ్యాహ్నం బరిపద చౌ మైదానంలో భారీ బహిరంగ సభకు ఎన్నికల ప్రచార ఊరేగింపులో చేరి ప్రసంగించనున్నారు. అనంతరం కేంద్రాపడాలో జరిగే మరో ర్యాలీలో ప్రసంగిస్తారు. అమిత్ షా ఈనెల 28న రాష్ట్రంలో పర్యటించి మూడు బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు. చాంద్‌బాలి, కొరోయి, నిమాపడాలో ఎన్నికల సభల్లో ఆయన ప్రసంగిస్తారు.

పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌పై దాడి



గాయపడిన నిందితుడు టక్రిని తరలిస్తున్న పోలీసులు

కొరాపుట్: పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌పై దాడి చేసి నిందితుడు పరారైన ఘటన సోమవారం కొరాపుట్ జిల్లా నందపూర్‌లో చోటు చేసుకుంది. నందపూర్ సమితి హిక్కమా పుట్ గ్రామ పంచాయతీ కిలువా గ్రామంలో ఒక బాలిక అదృశ్యమైంది. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు ఆ గ్రామంలో పలువురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అందులో సాహిల్ అనే యువకుడు ఉన్నాడు. సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది బయటకు వెళ్లారు. అదే సమయంలో డ్యూటీలో ఉన్న కుషిద్ టక్రి తలపై దాడి చేసి సాహిల్ పరారయ్యాడు. తీవ్ర గాయాలపాలైన టక్రిని పోలీసులు నందపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలకి తరలించారు. నిందితుడిని అరెస్ట్ చేయడానికి పోలీసులు గాలిస్తున్నారు.

గంజాయి మత్తులో ఒకరిపై ఒకరు దాడి



గాయాలుపాలైన మైనర్లు

పర్లాకిమిడి: గంజాయికి అలవాటుపడిన ఇద్దరు మైనర్ల బ్లేడ్లు, చాకులతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన గజపతి జిల్లా కాశీనగర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గంజాయికి అలవాటుపడిన ఇద్దరు స్నేహితులు గొట్టిపల్లి కృష్ణ (16), సుబేంధు మహారణా(17) ల మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో కాశీనగర్ వేంకటేశ్వర మందిరం అవతల నిర్మానుష్య ప్రాంతంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని పీకలు కోసుకున్నారు. తీవ్రంగా గాయపడిన మైనర్లను స్థానికులు పర్లాకిమిడి కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించిన ఒక బాలుడుని బరంపురం మెడికల్‌కు సోమవారం తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కాశీనగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలో ఒక చాకు, బ్లేడు దొరికినట్లు కాశీనగర్ పోలీసు అధికారి గోవింద గౌడ తెలియజేశారు. వీరు గంజాయికి అలవాటు పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. కేసును కాశీనగర్ పోలీసులు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

సములాయి దుర్గకు విశేష పూజలు



పూజలో సములాయి అమ్మవారు

రాయగడ: స్థానిక పాయికొ వీధిలో శుక్రవారం నుంచి జరుగుతున్న మా సములాయి దుర్గా జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బలముండ నేతృత్వంలో జరుగుతున్న ఈ పూజల్లో ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రీతికరమైన తురాయి పూలతో పూజార్చనలను నిర్వహించారు. కుంకుమ, అభిషేకాలతో అమ్మవారికి కొలిచారు. జాతరలో ప్రధాన ఘట్టమైన పూజారి మల్లెపై తొక్కే (అగ్గి మీద నడవడం) కార్యక్రమం మంగళవారం రాత్రి 9.30 గంటలకు ప్రారంభమవుతుంది. బుధవారంతో ఉత్సవాలు ముగుస్తాయి.

మూడో దశ పోలింగ్ 74.45 శాతం



భువనేశ్వర్: రాష్ట్రంలో శనివారం జరిగిన మూడో దశ పోలింగ్‌లో 74.45 శాతం ఓటింగ్ నమోదైంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను మినహాయించి 74.45 శాతం మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం అధికారికంగా తుది గణాంకాలు వెల్లడించింది. ఈ విడతలో 6 లోక్‌సభ స్థానాలతో పాటు 42 శాసనసభ నియోజకవర్గాలకు ఎన్నిక జరిగింది.

– భువనేశ్వర్‌లో అత్యల్పం

సంబల్‌పూర్‌లో అత్యధిక ఓటింగ్ నమోదు కాగా భువనేశ్వర్‌లో అత్యల్పంగా పోలింగు నమోదైంది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి విడుదల చేసిన గణాంకాల ప్రకారం సంబల్‌పూర్‌లో 79.5 శాతం, కెంజొహర్‌లో 78.97 శాతం, ఢెంకనాల్‌లో 78.01 శాతం, కటక్‌లో 71.20 శాతం, పూరీలో 75.43 శాతం, భువనేశ్వర్‌లో 64.49 శాతం ఓటింగ్ నమోదైంది.

మెరుగుపడిన పోలింగ్

ఇటీవల ముగిసిన ఎన్నికలతో పోల్చితే భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలింగ్ పరిస్థితి కొంతమేరకు మెరుగుపడింది. భువనేశ్వర్ లోక్‌సభ స్థానం పరిధిలో నగరంలోని 3 అసెంబ్లీ సెగ్మెంట్‌లు మరియు ఖుర్దా జిల్లాలోని 4 అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఉన్నాయి. ఈసారి జరిగిన ఎన్నికల్లో భువనేశ్వర్ లోక్‌సభ స్థానంలో పోలింగ్ శాతం సుమారు 5 శాతం పెరిగింది. పోలింగ్ రోజు అనుకూలమైన వాతావరణం, విస్తృతమైన అవగాహన కార్యక్రమాలతో మొదటిసారి ఓటు వేసిన కొత్తతరం ఓటర్లలో ఉత్సాహం పోలింగు శాతం మెరుగుపడేందుకు తోడ్పడినట్లు కనిపిస్తోంది. ఈ నియోజకవర్గంలో 2019లో 59.60 శాతం, 2014లో 58.38 శాతం పోలింగ్ నమోదైంది. భారత ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం నగరంలో మూడు అసెంబ్లీ స్థానాలు భువనేశ్వర్ (సెంట్రల్), భువనేశ్వర్ (ఉత్తర), ఏకామ్ర భువనేశ్వర్‌లో సాధారణంగా 50 శాతం కంటే తక్కువ పోలింగ్ నమోదు అవుతుంది. ఈసారి 53.87 పోలింగ్ శాతం నమోదు కావడం విశేషం. భువనేశ్వర్ (సెంట్రల్) అసెంబ్లీ నియోజకవర్గంలో ఈసారి 51.23 శాతం ఓటింగ్ నమోదైంది. లోగడ 2019లో జరిగిన ఎన్నికల్లో పోలింగ్ 43.25 శాతానికి పరిమితం అయ్యింది. ఈ లెక్కన తాజా పోలింగ్‌లో దాదాపు 8 శాతం వృద్ధి నమోదైంది. అదేవిధంగా భువనేశ్వర్ (ఉత్తర) 2019లో 45.39 శాతంతో పోలిస్తే తాజాగా 53.93 శాతంతో 8.59 శాతం పోలింగ్ పుంజుకుంది. ఏకామ్ర భువనేశ్వర్ అసెంబ్లీ సెగ్మెంటులో 56.42 శాతం పోలింగ్ రికార్డు అయింది. ఈ స్థానంలో 2019లో 47.64 శాతం పోలింగు నమోదు అయింది. తాజా పోలింగులో పోలింగ్ 8.78 శాతం వృద్ధిని నమోదు చేసింది.

భువనేశ్వర్ లోక్‌సభ స్థానం 3వ దశ పోలింగ్ విశ్లేషణ

అసెంబ్లీ సెగ్మెంటు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
జయదేవ్	77,925	70,008	4	1,47,937	80.77
భువనేశ్వర్ (సెంట్రల్)	58,655	53,571	60	1,12,286	51.23
భువనేశ్వర్ (ఉత్తర)	80,442	73,637	31	1,54,110	53.93
ఏకామ్ర భువనేశ్వర్	80,349	71,517	11	1,51,877	56.42
జట్నీ	90,970	82,243	12	1,73,225	70.19
బెగుణియా	82,168	75,694	5	1,57,867	71.96
ఖుర్దా	91,960	89,399	5	1,81,364	72.75

ఎవరి లెక్కల్లో వారు..!



పర్లాకిమిడి బీజేడీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి (ఫైల్)



బీజేపీ అభ్యర్థి కోడూరు నారాయణ రావు (ఫైల్)



కాంగ్రెస్ అభ్యర్థి బిజయకుమార్ పట్నాయిక్ (ఫైల్)

పర్లాకిమిడి: తొలి దశలో పోలింగ్ జరిగిన గజపతి జిల్లాలోని మోహన, పర్లాకిమిడి నియోజకవర్గాల్లో మూడు ప్రధాన పార్టీలు బీజేడీ, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు తమ గెలుపుపై ఎవరి లెక్కల్లో వారు ఉన్నారు. కౌంటింగ్‌కు ఇంకా చాలా రోజులు వ్యవధి ఉండడంతో పర్లాకిమిడిలో ఏమూల మాట్లాడుకున్నా ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తాడో అంటూ చర్చించుకోవడం కనిపిస్తోంది. ఎప్పుడూ పర్లాకిమిడి నియోజకవర్గంలో కాంగ్రెస్, స్వతంత్ర్య అభ్యర్థులు గెలుస్తూ వస్తున్నారు. దివంగత ఎమ్మెల్యే త్రినాథ సాహు మూడు సార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా 1985, 2000, 2004 గెలుపొందగా, స్వతంత్ర్య అభ్యర్థిగా ఆయన 1995లో గెలుపొంది తదనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం 2009లో కోడూరు నారాయణ రావు బీజేడీ పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. 2019లో బీజేడీ పార్టీ అధిష్టానం అసెంబ్లీ టిక్కెట్టు ఇవ్వకపోవడంతో ఆయన భాజపాలో చేరి అధిక మెజారిటీతో గెలిచారు. పర్లాకిమిడి నియోజకవర్గంలో బీజేడీ అభ్యర్థిగా రూపేష్ పాణిగ్రాహి పోటీ చేస్తుండగా, బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు, కాంగ్రెస్ అభ్యర్థిగా బిజయ పట్నాయక్‌లు ఈసారి పోటీ చేశారు. పోలింగు జరిగి 15 రోజులు గడుస్తోంది. జూన్ 4న పర్లాకిమిడి ఎస్‌కేసీజీ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరగనుంది. దీంతో ఎక్కడ చూసినా వీరి గురించే చర్చలు జరుగుతున్నాయి. బీజేడీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి కోసం ఈ ఎన్నికల్లో స్టార్ కాంపైనర్లు సీఎం నవీన్ పట్నాయిక్, తెలుగు హీరో సుమన్, ఓలివుడ్ హీరో హీరోయిన్లు సవ్యసాచి, అర్చనా, బాబుసేన్, ఎలినా సామంత్రే, హైదరాబాద్ నుంచి జబర్దస్త్ టీంలు విచ్చేసి గుసాని, గురండి, గుమ్మా సమితిల్లో పర్యటించారు. ఈ ఎన్నికల్లో 3,500 మెజార్టీతో బీజేడీ గెలుస్తుందని పార్టీ సీనియర్ నాయకులు అంటున్నారు. భాజపా అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు ఏ స్టార్ క్యాంపైన్ లేకుండా ప్రచారం చేసి మరోసారి అధిక మెజారిటీతో గెలుస్తామని అంటున్నారు. కాశీనగర్, గుమ్మా, గుసాని సమితిలో బీజేపీ క్యాడర్ బలం పెరిగిందని భాజపా నాయకులు అంటున్నారు. గుమ్మా సమితిలో అత్యధికంగా 46,693 పోలవ్వగా, కాశీనగర్ సమితిలో 37,213, గుసాని సమితిలో 42,191, పర్లాకిమిడి టౌనులో 21,630 ఓట్లు పోలయ్యాయి. గుమ్మాలో కాంగ్రెస్ అభ్యర్థి బిజయపట్నాయిక్‌కు 30వేల ఓట్లు లభిస్తాయని ఆ పార్టీ నేతలు అంటున్నారు. కాంగ్రెస్ కంచుకోట అయిన గుమ్మాలో ఏ పార్టీకి అత్యధికంగా ఓట్లు లభిస్తే ఆ పార్టీకే విజయావకాశాలు ఎక్కువగా వుంటాయని అనేక రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

కటక్, పూరీలో హింసాత్మక ఘటనలు

భువనేశ్వర్: రాష్ట్రంలో మూడు విడతల ఎన్నికలు చాలా వరకు ప్రశాంతంగా జరిగినప్పటికీ, గత కొన్ని రోజులుగా అనేక చోట్ల ఎన్నికల అనంతర హింసాత్మక సంఘటనలు పెచ్చుమీరుతున్నాయి. కటక్ జిల్లా బంకీ పోలీసు థాణా పరిధిలోని బెడ్‌పూర్ గ్రామంలో ఆదివారం రెండు రాజకీయ వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో 6 మంది గాయపడ్డారు. క్షతగాత్రులందరినీ చికిత్స నిమిత్తం బంకి ఆస్పత్రికి తరలించారు. ఘర్షణ వెనుక ఖచ్చితమైన కారణం నిర్ధారించాల్సి ఉంది. ఈ ఘర్షణతో ఘటనా స్థలంలో చాలాసేపు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ హింసాత్మక చర్యలకు వ్యతిరేకంగా స్థానికులు ఆదివారం రాత్రి కటక్–బంకి రహదారిపై కదలికలను స్తంభింపజేశారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతర హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో పూరీ జిల్లా పిప్పిలి ఎమ్మెల్యే రుద్రప్రతాప్ మహారథి తన మద్దతుదారులతో ఆదివారం ప్రయాణిస్తున్న కారుపై గుర్తు తెలియని దుండగులు రాళ్లు రువ్వారు. ఈ ఘటన పూరి జిల్లాలోని నిమాపడా పరిధిలోని టిరుండియాలో చోటు చేసుకుంది. ఈ ఘటన తర్వాత నిమాపడా పోలీసులు తెరుండియా పంచాయతీకి చెందిన ప్రతిపక్ష నేతను అదుపులోకి తీసుకున్నారు.

315 కేజీల గంజాయి పట్టివేత



గంజాయి బస్తాలు



గంజాయితో పట్టుబడిన ట్రక్కు

జయపురం: జయపురం అబ్కారి సెటలైట్ విజిలెన్స్ విభాగం అధికారులు 315 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రాత్రి నీలగిరి కర్రలు రవాణా చేస్తున్న ట్రక్కులో గంజాయిని రవాణా చేస్తుండగా జయపురం సమితి ఉమ్మిరి గ్రామ సమీప నది వంతెనపై ట్రక్కును నిలిపి తనిఖీ చేపట్టారు. ట్రక్కులో 7 మూటల గంజాయిని గుర్తించినట్లు బరంపురం అబ్కారి సెటలైట్ అధికారి స్నేహలత నాయిక్ సోమవారం వెల్లడించారు. ట్రక్కు డ్రైవర్ రామ రాజ గుజ్జర్, హెల్పర్ శంకరలాల్ గుజ్జర్‌ను అరెస్ట్ చేశామన్నారు. వీరిద్దరు రాజస్థాన్ రాష్ట్ర వాసులని తెలిపారు. ట్రక్కు బొయిపరిగుడ పోలీసు స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతం నుంచి నీలగిరి కలపతోపాటు 7 బస్తాల గంజాయిని రవాణా చేస్తూ జాతీయ రహదారిలో బొరిగుమ్మ వైపు వెళ్తుడంగా ముందుగా సమాచారం మేరకు మాటు వేసి పట్టుకున్నామన్నారు. గంజాయి విలువ రూ.31.50 లక్షలు ఉంటుందన్నారు. జయపురం అబ్కారి సబ్‌ఇన్‌స్పెక్టర్ గంగమయి హేమ్రమ్, సెటలైట్ విజిలెన్స్ విభాగ సిబ్బంది ఎఎస్‌ఐ రశ్మీరంజన్ నాయక్, కె.చంద్ర శేఖర్, సుశాంత పాత్రో, కపిలేష్ భొత్ర, సంతోష్ కుమార్‌నాయక్, పూజా నాయక్ తదితరులు గంజాయిని పట్టుకున్నట్లు వెల్లడించారు.

మో బస్సులో నగదు చోరీ

భువనేశ్వర్: నగరంలోని మో బస్సులో సోమవారం నగదు చోరీ సంఘటన చోటు చేసుకుంది. కుమారుడి చికిత్స కోసం కూడగట్టుకున్న సొమ్మును దొంగలు దోచుకున్నారని బాధితుడు వాపోయాడు. చికిత్స కోసం ఆస్పత్రిలో జమ చేసేందుకు తీసుకుని వెళ్తున్న రూ.60,000 పోయాయని వాపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. గంజాం జిల్లా హింజిలి కాటు ప్రాంతానికి చెందిన బృందాబన్ సాహు తన కొడుకు బిభూ ప్రసాద్ చికిత్స కోసం స్థానిక ఎయిమ్స్ ఆస్పత్రిలోని న్యూరాలజీ విభాగంలో డబ్బులు జమ చేసేందుకు మో బస్సులో వెళ్తుండగా దొంగతనం జరిగింది. దీంతో స్థానిక థాణా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బృందాబన్ సాహు తన జేబులో డబ్బు తో రూట్ నంబర్ 19లో మో బస్సు ఎక్కాడు. బస్సు కిక్కిరిసి ఉండడంతో ఖండగిరి వద్దకు చూసుకునే సరికి డబ్బులు దొంగిలించినట్లు గుర్తించాడు. ఈ సంఘటనపై తక్షణమే స్థానిక ఖండగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం మో బస్సులోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి నిందితుడిని గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రసవ వేదన

ఓ వైపు పురిటి నొప్పులు.. మరో వైపు కొండల్లో నడక.. ఇంకోవైపు ప్రసవంపై భయం.. గిరిజన గ్రామాల్లో దశాబ్దాలుగా వినిపిస్తున్న ప్రసవ వేదన కోరుకొండ సమితి నక్కమామ్ముడి పంచాయతీ గదిగూడ గ్రామంలో మళ్లీ బిగ్గరగా వినిపించింది. గ్రామానికి చెందిన మాధు ముదిలీ భార్య ప్రతిమా ముదిలికు సోమవారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. కోరుకొండ ఆరోగ్య కేంద్రం అంబులెన్స్‌కు ఫోన్ చేయగా.. ఆ ఊరికి అంబులెన్స్ పంపించడానికి దారి లేదని చెప్పారు. దీంతో స్థానిక మహిళలతో కలిసి ఆమె అడవి దారిలో రెండు కిలోమీటర్ల పాటు నడిచారు. హతిబో గ్రామం వరకు అలా రాగా.. అక్కడ అంబులెన్స్‌లో ఎక్కించి కోరుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె మగ పిల్లాడికి జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

– మల్కన్‌గిరి



అడవి మార్గంలో నడుస్తున్న గర్భవతి

రక్తదానం.. ప్రాణదానం

జయపురం:

జయపురం సిమెంట్ వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జయపురం సదర్ పోలీస్ స్టేషన్ అధికారి ఈశ్వర చంద్ర తండి, జయపురం బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ సూర్య శేఖర మిశ్ర ప్రారంభించారు. 96 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. 18 మంది మహిళలు, యువతులు స్వచ్ఛందంగా వచ్చి రక్తాన్ని దానం చేశారు. రక్తదానం చేసిన వారిలో సిమెంట్ వ్యాపారుల కుటుంబ సభ్యులతోపాటు సిమ్మెంట్ దుకాణాలలో పనివారు తదితరులు ఉన్నారు. పట్టణ పోలీస్ అధికారి రమణీ రంజన్ దొలాయ్, సేల్స్ టాక్స్ విభాగం అధికారి జయంత శతపతి, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్లు అయజయ్ కుమార్ పండ, గురు పొరజ, ప్రతిభ పాత్రో, నతినినాల్ ధాని, ప్రభుత్వ ఎ.ఎన్.ఎం శిక్షణ కేంద్రం విద్యార్థులు, జయపురం సబ్‌డివిజన్ రక్త దాతల అసోసియేషన్ కార్యదర్శి ప్రమోద్ కుమార్ రొళో, భరద్వాజ బక్షీ, రంజన్ మిశ్ర పాల్గొన్నారు. రక్త దాతలకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేశారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పోలీసు అధికారి తండి, డాక్టర్ మిశ్ర



రక్త దానం చేస్తున్న దాతలు



రక్తదానం చేసిన దాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

రక్త నిల్వలు పెంచాలని వినతి



సీడీఎంఓకు వినతిపత్రం సమర్పిస్తున్న మంచ్ సభ్యులు

రాయగడ: పట్టణంలో గల ప్రభుత్వ ఆస్పత్రిలో రక్త నిల్వలు పెంచాలని జిల్లా వికాష్ మంచ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని మంచ్ సభ్యులు జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్‌కు సోమవారం సమర్పించారు. మంచ్ అధ్యక్షులు దయానిధి ఖడంగా, నరోజ్ సాహు తదితరులు వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు. ఆదివాసీ, హరిజన జిల్లాగా గుర్తింపు పొందిన రాయగడలో గల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వైద్య సేవలు పొందేందుకు ఈ ఆస్పత్రికే వస్తుంటారని, అయితే అత్యవసర సమయంలో రక్తలేమితో రోగులు నానా అవస్థలు పడుతున్నారని మంచ్ అధ్యక్షులు ఖడంగా తెలియజేశారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు వంటి అత్యవసర సమయంలో ఈ సమస్య మరింత జటిలమవుతుందని అన్నారు. అందువల్ల రక్త నిల్వలు పెంచి అవసరమైన రోగులకు ఉచితంగా రక్తం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

లండన్ మ్యాగ్జైన్‌లో కుప్పిలి కవితకు స్థానం

ఆమదాలవలస రూరల్: లండన్‌కు చెందిన తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ (తాల్) ఉగాది సందర్భంగా విడుదల చేసిన మా తెలుగు 2024 వార్షిక సంచికలో ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావు రచించిన కవితకు స్థానం లభించింది. కుప్పిలి రచించిన తనివితీరని తావి- తెలుగు అనే కవితకు స్థానం వచ్చినట్లు లండన్ సంపాదకులు నెల్లుట్ల సునీత మెయిల్ ద్వారా సమాచారం తెలియజేశారని కవి రాజారావు సోమవారం తెలిపారు. భారతరత్న పీవీ నరసింహారావు ముఖచిత్రంతో విడుదల చేసిన ఈ సంచికను ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ ఆవిష్కరించారని తెలిపారు.

శతాధిక వృద్ధునికి సన్మానం



శతాధిక వృద్ధుడు ఇప్పిలి తుంబనాథంను సన్మానిస్తున్న నేతలు

కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామానికి చెందిన వందేళ్లు పూర్తిచేసుకొన్న వృద్ధుడు ఇప్పిలి తుంబనాథంను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. వేర్వేరు చోట్ల ఉన్న ఈ వృద్ధుని కుమారులు, కుమార్తె, మిగతా కుటుంబసభ్యులు, బంధువులు అంతా ఒకచోట చేరి సత్కరించి, గ్రామస్తులందరికీ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత ఇప్పిలి కృష్ణారావు, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు మెండ హేమావతి, ఆమె భర్త ప్రకాశరావు, వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నేతలు కప్పల యుగంధర్, మెండ మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని మహిళకు గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని పాతబస్టాండు సమీపంలోని పందంప్పళ్ల జంక్షన్ వద్ద ఆటో ఢీకొని మహిళకు గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుడివీధిలో నివాసముంటున్న మలిపెద్ది శశికళ అనే మహిళ తన స్నేహితురాలు పార్వతితో కలిసి ఆదివారం పాత మార్కెట్‌కు వెళ్లింది. సామాన్లు కొని ఇంటికి వస్తుండగా పందుంప్పళ్ల కూడలి వద్ద వెనుకగా వచ్చిన ఆటో శశికళను ఢీకొట్టడంతో ఆమె రోడ్డుపై పడిపోయింది. వెంటనే ఆమెను రిమ్స్‌లో చేర్పించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాదరావు చెప్పారు.

చల్లవానిపేటలో రూ. 5 లక్షలు చోరీ

జలుమూరు: మండల పరిధి చల్లవానిపేట జంక్షన్‌లో సోమవారం రూ. ఐదు లక్షలు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సారవకోట మండలం చీడిపూడికి చెందిన పొన్నాన ఝాన్సీ తన భర్త గణపతిరావుతో కలిసి ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఆమె నెలవారీ కొంత సొమ్మును చల్లవానిపేట భారతీయ స్టేట్ బ్యాంక్‌లో పొదుపు(రికరింగ్ డిపాజిట్) చేసేవారు. ఆర్‌డీ కాలపరిమితి ముగియంగా చల్లవానిపేట స్టేట్ బ్యాంక్ నుంచి విత్‌డ్రా చేశారు. డబ్బును తన ద్విచక్ర వాహనంలో భద్రపరిచి చల్లవానిపేట జంక్షన్ వద్ద జ్యూస్ తాగి అదే వాహనంలో ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చాక వాహనంలో ఉన్న డబ్బును తీసేందుకు చూడగా కనిపించలేదు. దీంతో లబోదిబో మంటూ బ్యాంక్, చల్లవానిపేట పరిసరాలకు వచ్చి వెతికారు. ఫలితం లేకపోవడంతో సాయంత్రం జలుమూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ మధుసూదనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేడ మీద నుంచి జారిపడి వ్యక్తి మృతి



దూగాన సత్యనారాయణ (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని గూనపాలెంలో నివాసముంటున్న ఓ వ్యక్తి మేడ మీద నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందారు. ఒకటో పట్టణ ఎస్‌ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల మేరకు.. దూగాన సత్యనారాయణ (42) వంట మాస్టారుగా పనిచేసుకుంటూ తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఐదేళ్లుగా గూనపాలెంలోని అద్దె ఇంటిలో నివసిస్తున్నారు. భార్య విజయలక్ష్మి చేగొడియాల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు సత్యనారాయణ వంట పనులు ముగించుకుని ఇంటికి వచ్చి భోజనం చేసిన తర్వాత కుటుంబ సభ్యులతో సరదాగా మాట్లాడుతూ రాత్రి 12 గంటల వరకు గడిపారు. వేసవి ఉక్కబోత కారణంగా ఇంటిపైన రెండో ఫ్లోర్ మేడ మీద పడుకుంటానని భార్య, కుమార్తెలతో చెప్పి వెళ్లారు. సోమవారం వేకువజాము ఐదు గంటల సమయంలో పక్కింటిలో నివసిస్తున్న ఆర్.పద్మావతి వచ్చి విజయలక్ష్మిని లేపి నీ భర్త పెరడులో ఉన్న బురదగుంట, ముళ్లకంప మధ్యలో గాయాలతో పడి ఉన్నాడని చెప్పడంతో ఆమె వెళ్లి చూసే సరికి.. సత్యనారాయణ కొన వూపిరితో పడి ఉన్నాడు. తలకు బలమైన గాయమైంది. దీంతో ఆటో మీద హుటాహుటిన రిమ్స్‌కు తీసుకెళ్లారు. అయితే ఉదయం 6.30కు ఆయన చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మేడపై భాగాన ఎలాంటి పిట్ట గోడ లేకపోవడంతో నిద్రలో దొర్లుకుంటూ తన భర్త కింద పడిపోయి ఉంటాడని భార్య విజయలక్ష్మి చెప్పడంతో ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.


30 టన్నుల మామిడి పండ్లు ఎగుమతి



ఛత్తీస్‌గఢ్‌కు రవాణా చేస్తున్న మామిడి పండ్లు

జయపురం: ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్, తదితర ప్రాంతాల నుంచి వివిధ రకాల మామిడి పండ్లు కొరాపుట్ జిల్లాకు వచ్చేవి. కొరాపుట్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు మామిడి తోటలు వేశారు. అంతగా విక్రయం కాకపోవటంతో రైతులు నష్టపోతూ వచ్చారు. రైతుల నుంచి మామిడి పండ్లు కొనుగోలు చేసి వారికి మద్దతు ధర లభించేందుకు మిషన్ శక్తి మహిళా సమితి, సివైఎస్‌డి సహకారంతో డొంగర రాణి కృషి ఉత్పాదన కంపెనీ లిమిటెడ్ ముందంజ వేశాయి. జిల్లాలో దసమంతపూర్ సమితిలో సివైఎస్‌డి సహకారంతో డొంగర రాణి కృషి ఉత్పాదన కంపెనీ లిమిటెడ్ వారు దసమంతపూర్ సమితి ప్రాంతాల్లో మామిడి ఉత్పత్తులను సేకరించి వాటిని ఛత్తీషగఢ్, కటక్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. గత రెండు రోజుల్లో దసమంతపూర్ సమితి పటామాలిగుడ, కర్తాస్, జానిగుడ, కావుగుడ, పాట్‌ఖండ్, అడముండ ప్రాంతాల నుంచి 30 టన్నుల మామిడి పండ్లను ఛత్తిషగఢ్, కటక్‌కు పంపినట్లు కంపెనీ సీఈఓ యజ్ఞదత్త మహరాణ వెల్లడించారు. జిల్లాలో జయపురం, బొరిగుమ్మ, కక్కిరిగుమ్మ తదితర ప్రాంతాల్లో ఈ ఏడాది మామిడి పంట బాగా పండిందని, రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చూస్తామని మహరాణ తెలిపారు.

మళ్లీ పెరగనున్న ఉష్ణోగ్రతలు



భువనేశ్వర్: రాష్ట్రంపై రీమల్ తుఫాన్ ప్రభావం చూపకపోవడంతో మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పగటిపూట ఉష్ణోగ్రతలు మరోసారి పెరుగుతాయని స్థానిక భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ప్రాంతీయ కార్యాలయం ముందస్తు సమాచారం సోమవారం జారీ చేసింది. ఐఎండీ ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ మనోరమ మహంతి తెలిపారు. మంగళవారం నుంచి రాష్ట్రమంతటా పగటిపూట ఉష్ణోగ్రత 2 డిగ్రీల సెల్సియస్ నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు పెరుగుతుందని అంచనా. రాష్ట్రంలో వడగాలుల పరిస్థితులు త్వరలో తిరిగి వచ్చే అవకాశం లేదు. అలాగే రాష్ట్రంలో ఉరుములు, భారీ వర్షాలు కురిసే అవకాశం లేదు. వచ్చే వారంలో రాష్ట్రంలోని కొన్ని చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. గత 24 గంటల్లో రాష్ట్రంలో కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. నయాగడ్ జిల్లా రాంపూర్‌లో గరిష్టంగా 92.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కేంద్రాపడా జిల్లాలోని రాజ్‌నగర్‌లో 78 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈనెల 31 వరకు వాతావరణంలో ఎలాంటి మార్పు ఉండదని వాతావరణ శాఖ అంచనా వేసింది.

మూడు దశల్లో 90 వేల పోస్టల్ బ్యాలెట్లు

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు అంచెలంచెలుగా పూర్తవుతున్నాయి. ఇప్పటివరకు మూడు దశల్లో ఈ ఎన్నికలు పూర్తయిన విషయం తెలిసిందే. మూడో దశ ఎన్నికల పోలింగ్ ముగిసే సరికి రాష్ట్రంలో సమగ్రంగా 90,000 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకున్నారు. దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన వయో వృద్ధులు, అత్యవసర సేవలలో నిమగ్నమైన వ్యక్తులు మరియు ఎన్నికల విధుల్లో నిమగ్నమైన ప్రభుత్వ ఉద్యోగుల ఓటు హక్కుని వినియోగించుకోవడానికి పోస్టల్ బ్యాలెట్ల సౌకర్యానికి అర్హులని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో లోక్‌సభ, శాసనసభకు ఏక కాలంలో జరిగిన మూడో విడత ఎన్నికలు ముగిసే వరకు దాదాపు 94,000 పోస్టల్ బ్యాలెట్లను అర్హులైన వ్యక్తులు వినియోగించుకున్నారని సీఈవో తెలిపారు. 85 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న అనేక మంది వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో మొదటిసారిగా ప్రవేశపెట్టిన హోమ్ ఓటింగ్ సౌకర్యాన్ని కూడా వినియోగించుకున్నారు. అంతేకాకుండా కొంతమంది ఓటర్లు పీవీసీ మరియు పీబీఎఫ్‌సీ సహాయంతో తమ ఓటును వేశారని సీఈవో తెలిపారు.

చివరి విడత ప్రచారానికి కాంగ్రెస్ ప్రముఖులు

భువనేశ్వర్: రాష్ట్రంలో చిట్ట చివరి దశ నాలుగో విడత పోలింగ్‌కు ప్రచారం ఊపందుకుంది. ఈ విడతలో పోటీ చేస్తున్న కాంగ్రెసు అభ్యర్థుల కోసం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. వీరివురు వరుసగా ఈనెల 29, 30 తేదీల్లో ఒడిశాలో పర్యటించి జూన్ 1న రాష్ట్రంలో 4వ దశ జంట ఎన్నికలకు ముందు పార్టీ అభ్యర్థుల కోసం ప్రచారం చేయనున్నారు. ఈ సమాచారాన్ని ఒడిశా కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ అజయ్ కుమార్ మీడియాకు తెలియజేశారు. ఈనెల 29 ఉదయం 11 గంటలకు బాలాసోర్‌లో జరిగే ఎన్నికల ర్యాలీలో మల్లికార్జున్ ఖర్గే ప్రసంగిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3.00 గంటలకు, భద్రక్ జిల్లాలోని చాంద్‌బాలిలో మరో ర్యాలీలో ఏఐసీసీ చీఫ్ ప్రసంగిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే ఈనెల 30న భద్రక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని సిములియాలోని నన్నొమహిత్‌పూర్‌లో జరిగే ఎన్నికల సభలో రాహుల్ గాంధీ ప్రసంగించనున్నారు. మయూర్‌భంజ్, భద్రక్, బాలాసోర్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా జాజ్‌పూర్ లోక్‌సభ స్థానాలతోపాటు వాటి పరిధిలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు జూన్ 1న ఎన్నికలు జరగనున్నాయి.

పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వారితో పోలీసులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం రక్తదాన శిబిరం జరిగింది. గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో జరిగిన ఈ శిబిరానికి ఎస్‌డీపీఓ బబులి నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వచ్ఛందంగా పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు.

అదేవిధంగా పట్టణంలో యువత కూడా తమ మద్దతును తెలిపి రక్తదానం చేశారు. మొత్తం 50 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు ఐఐసీ ఉత్తమ్ కుమార్ సాహు తెలియజేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను సబ్ డివిజన్ పరిధిలో గల అన్ని పోలీస్ స్టేషన్‌లలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఎస్‌డీపీఓ బబులి నాయక్ తెలియజేశారు. రక్తదానం చేసిన వారికి ధ్రువీకరణ పత్రాలను పోలీస్ శాఖ అందించింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



అడవ సీహెచ్‌సీ నుంచి కిసాన్ మల్లిక్‌ను బరంపురం మెడికల్‌కు తరలిస్తున్న వైద్య సిబ్బంది

పర్లాకిమిడి: గజపతి జిల్లా అడవ పోలీస్‌స్టేషన్ పరిధిలో అడవ సెంటర్ వద్ద సోమవారం ఒక బైక్, ట్రాక్టరును ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పిన్నీ కొడుకులైన అర్పితా మల్లిక్, కిసాన్ మల్లిక్‌లు పని మీద కొంధమాల్ జిల్లా బ్రాహ్మణిగావ్ పంచాయతీ పురుగుడ గ్రామం నుంచి బైక్‌పై అడవ వస్తుండగా అకస్మాత్తుగా అడవ నుంచి వస్తున్న ట్రాక్టరును ఢీకొట్టారు. దీంతో వీరిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని అడవ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేర్చారు. గాయాలు తీవ్రంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం బరంపురం మెడికల్‌కు తరలించారు. అడవ పోలీసులు సంఘటనా స్థలానికి విచ్చేసి బైక్, ట్రాక్టరును స్వాధీనం చేసుకుని కేసు రిజిస్టర్ చేసుకున్నారు.

178 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

జయపురం: సునాబెడ గంజాం కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సెమిలిగుడ వైద్య, ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 178 మందికి వైద్య ఆరోగ్య కేంద్రం ప్రధాన డాక్టర్ అభిషేక్ రౌత్ వైద్య పరీక్షలు చేపట్టారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య సిబ్బంది దేవ దర్శిణీసాహు, తనూపమ పాత్రో, వర్షారాణి సాహు, ఎఎన్‌ఎం, అంగన్‌వాడీ వర్కర్లు సహకారం అందించారు. సునాబెడ మున్సిపాల్టీ 5వ వార్డు కౌన్సిలర్ మనోజ్ సున శిబిరం నిర్వహణకు సహకరించారు.

హెచ్‌సీ ప్రసాద్ కుటుంబానికి ఫ్లాగ్ ఫండ్ అందజేత



ఫండ్ చెక్‌లను అందజేస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: నౌపడ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెచ్‌సీ కె.ప్రసాద్ అనారోగ్యంతో ఇటీవల మరణించడంతో కుటుంబ సభ్యులకు ఎస్పీ జీఆర్ రాధిక చేతుల మీదుగా ఫ్లాగ్ ఫండ్ అందజేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో శాఖాపరమైన ఫ్లాగ్ ఫండ్ రూ.50 వేలు, విడో ఫండ్ రూ. 25వేలు చెక్‌లను అందజేశారు. శాఖాపరంగా రావాల్సిన ప్రయోజనాలను త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రేమ కాజల్, ఏఓ గోపీనాద్ ఉన్నారు.

ఒడిశా కార్మికుడి మృతి



హేమంత్ భుయ్ మృతదేహం

పద్మనాభం: మద్దిలోని ఇటుక బట్టీలో పని చేస్తున్న ఒడిశాకు చెందిన హేమంత్ భుయ్(27) అనే కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. మద్దిలో పోక శ్రీనివాసరావు ఇటుక బట్టీలో కూలి పనిచేయడానికి ఒడిశా రాష్ట్రం బలంగీర్ జిల్లా బాబాల జురి సమీపంలోని బంద బుజారికి చెందిన హేమంత్ భుయ్ తన భార్య రోజి బామ్‌తో కలసి ఈ ఏడాది జనవరిలో వచ్చాడు. సోమవారం బట్టీలో పనిచేస్తుండగా హేమంత్ భుయ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు వెంటనే 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్ వచ్చే సరికి ఆయన మృతి చెందాడు. హేమంత్ గుండెపోటుతో మరణించినట్లు 108 సిబ్బంది నిర్ధారించారని పోలీసులు వెల్లడించారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత వస్తువుల గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

- రూ. 50 లక్షలకు పైగా ఆస్తినష్టం



వేకువజామున ఎగిసి పడుతున్న మంటలు

నరసన్నపేట: జాతీయ రహదారి–16 సర్వీసు రోడ్డును ఆనుకొని స్థానిక హెచ్‌పీ గిడ్డంగి వద్ద ఉన్న పాత వస్తువుల గోడౌన్‌లో సోమవారం వేకువజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో చాలా గంటల పాటు అగ్ని కీలలు ఎగిసిపడ్డాయి. ఆ మార్గంలో ప్రయాణించడానికే వాహనదారులు భయపడ్డారు. పక్కనే ఉన్న హెచ్‌పీ గోడౌన్‌కు ఈ ప్రమాద వేడి రావడంతో ముందు జాగ్రత్త చర్యగా గ్యాస్ సిలెండర్లను అక్కడి నుంచి తరలించారు. గిడ్డంగిలో ప్రమాద సమయానికి 90 టన్నులకు పైగా వివిధ పాత వస్తువులు ఉన్నట్లు సమాచారం. ప్లాస్టిక్ వస్తువులతో పాటు ఇనుప వస్తువులు, వాటర్ బాటిల్స్, వివిధ రకాల మిషన్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో రూ. 50 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగి ఉంటుందని గిడ్డంగి యజమాని కోరాడ వైకుంఠరావు (బుజ్జి) తెలిపారు. కాగా ప్రమాద సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే వాతావరణం అనుకూలించకపోవడం గాలి తీవ్రత అధికంగా ఉండటంతో మంటలను అదుపు చేయలేకపోయారు. సాయంత్రం వరకూ దట్టమైన పొగ ఆ ప్రాంతంలో జనాలను ఉక్కిరిబిక్కిరి చేసింది. వేకువజాము 3 గంటల నుంచి ఉదయం 10 వరకూ మంటలు వస్తూనే ఉన్నాయి. దీనిపై యజమాని స్పందిస్తూ ఇది ప్రమాదం కాదని, కావాలనే కొందరు నాలుగు వైపులా మంటలు పెట్టి ఉంటారని వైకుంఠరావు అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం మంటలను అదుపు చేశారు.

‘హద్దు మీరితే చర్యలు తప్పవు’



మాట్లాడుతున్న టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి

పాతపట్నం: జూన్ నెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి అన్నారు. పాతపట్నం పోలీస్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని పాతపట్నం, మెళియాపుట్టి మండలాలకు చెందిన పార్టీ నాయకులకు, గ్రామ పెద్దలకు ఎన్నికల కోడ్‌పై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు చేసినా చర్యలు తీసుకుంటామని, బాణసంచా నిషేధమని, అలాకాదని ఎవరైనా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు కంటే ఎక్కువ మంది గుంపులుగా తిరగవద్దని సూచించారు. ఇప్పటికే గొడవలు, కేసుల్లో ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టామని, అల్లర్లు సృష్టించేందుకు ప్రయతిన్నంచే వారిపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సీఐ నల్లి సాయి, పాతపట్నం, మెళియాపుట్టి ఎస్‌ఐలు మహమ్మద్ యాసీన్, రాజేష్‌లు ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన రేగాన ఆనందరావు పూరిల్లు

బూర్జ: మండలంలో గల లక్కుపురం గ్రామంలో రేగాన ఆనందరావు అనే వ్యక్తికి చెందిన పూరిల్లు సోమవారం అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. గ్రామస్తులు, పాలకొండ అగ్నిమాపక సిబ్బంది తెలియజేసిన వివరాలు ప్రకారం.. లక్కుపురం ఎస్సీ కాలనీలో అగ్ని ప్రమారం సంభవించి ఇల్లు కాలి పెద్ద మంటలు రావడంతో స్థానికులు, ఇంటి యజమాని గమనించి పాలకొండ అగ్నిమాపక వాహనానికి సమాచారం అందజేశారు. ఆ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఇంటిలో ఉన్న వారికి ఎవరికీ ఏమీ కాలేదు. ఇంట్లో ఉన్న బంగారం, రూ.50 వేలు నగదు, వంట సామగ్రి, ఫర్నీచర్, బట్టలు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, మంటలకు ఆహుతైనట్లు పాలకొండ అగ్నిమాపక అధికారి జె.సర్వేశ్వరరావు తెలిపారు. నష్టం సుమారు రూ. 2.50 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

వంద శాతం ప్లేస్‌మెంట్‌లు లక్ష్యం

- శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవం
- హాజరైన స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ చదలవాడ నాగరాణి



ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నాగరాణి.

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో వంద శాతం ప్లేస్‌మెంట్‌లు లక్ష్యంగా ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ) డైరెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఉద్యోగ విజయోత్సవం (జాబ్ అచీవర్స్ డే) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చివరి ఏడాది చదవుతున్న పాలిటెక్నిక్ డిప్లమా విద్యార్థులు 209 మంది 14 పరిశ్రమల్లో ఉద్యోగాలు సాధించారు. క్యాంపస్ ఎంపికల్లో సత్తాచాటారు. ఈ విద్యార్థులను ఉద్యోగ విజయోత్సవంలో అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. డైరెక్టర్ మాట్లాడుతూ రూ. 2.54 లక్షలు వార్షిక ప్యాకేజీ నుంచి రూ.1.02 లక్షలు ప్యాకేజీ మధ్య విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. రిలీవ్ నాటికి ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించేలా నైపుణ్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కరిక్యులమ్, సిలబస్‌లో మార్పులు, పక్కాగా ప్రయోగాల నిర్వహణ, ఇంటర్న్‌షిప్ వంటివి అమలు చేస్తున్నట్లు చెప్పారు. పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభమైందని, జూన్ 3వ తేదీ వరకు కొనసాగుతుందని అన్నారు. ప్రభుత్వ కళాశాల్లో చేరేందుకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలని వివరించారు. జిల్లాలో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్, శ్రీకాకుళం మహిళల ప్రభుత్వ పాలిటెక్నిక్, టెక్కలి, ఆమదాలవలస, సీతంపేట పాలిటెక్నిక్‌ల్లో 780 సీట్లు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది 142025 మంది పాలిసెట్ –2024 పరీక్ష రాయగా, 124430 మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. పాలిటెక్నిక్‌లో చేరిన విద్యార్థుల్లో నైపుణ్య కల్పన, ఉద్యోగ సాధనలకు ప్రాధాన్యత నిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, ప్రిన్సిపాల్ జాయిం ట్ సెక్రటరీ డాక్టర్ బి.జానకిరామయ్య, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, టీపీ వో పి.యుగంధర్, అధ్యాపకులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు వృథా పోవు

- బొడ్డపాడులో ఘనంగా అమరుల సంస్మరణ సభ



మాట్లాడుతున్న విరసం నేత అరసవెల్లి కృష్ణ

పలాస: నాడు నక్సల్బరీ, శ్రీకాకుళం గిరిజనులు చేపట్టిన పోరాటాల కొనసాగింపే నేడు దండకారణ్యంలో జరుగుతున్న ఆదివాసీల పోరాటాలని విరసం అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ అన్నారు. పలాస మండలం బొడ్డపాడులోని జిల్లా అమరవీరుల స్మారక మందిరం వద్ద అమరుల బంధు మిత్రుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అమరవీరుల స్మారక సభను నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ అధ్యక్షతన జరిగిన సభలో విరసం అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అమరుల పోరాట బాటలోనే నేడు ప్రజలు పాల్గొని తమ సమస్యలను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. దండకారణ్యంలో గిరిజనులు పెద్ద ఎత్తున సహజ వనరుల పరిరక్షణ కోసం పోరాటాలు చేస్తున్నారని, అయితే పాలక వర్గాలు ఆ సంపదను కాజేయడానికి చూస్తున్నాయని విమర్శించారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో బూటకపు ఎదురు కాల్పులు జరుపుతూ అమాయకులైన ఆదివాసీలను చంపుతున్నారని, మణిపూర్ కంటే ఘోరంగా అక్కడి పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 29న నిజ నిర్ధారణ కమిటీ ఆ ప్రాంతాన్ని పర్యటించి అక్కడ పరిస్థితులను పరిశీలిస్తుందని అందుకు బుద్ధి జీవులంతా సహకరించి మద్దతు తెలిపాలని ఆయన కోరారు. ఈ సభ సందర్భంగా ముందుగా అమరవీరుడు అజాద్ తండ్రి లక్ష్మణరావు వేదిక ముందు అరుణ పతాకాన్ని ఎగురువేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పీడీఎం నాయకుడు వై.కోటేశ్వరరావు, డీటీఎఫ్ నాయకుడు కోత ధర్మారావు, ఏఎంపీఎస్ నాయకుడు ప్రభాకర్, ఏబీఎం సహాయక కార్యదర్శి భవాని, జోగి కోదండరావు, దాసిరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరావు, బొడ్డపాడు యువజన సంఘం నాయకులు తామాడ క్రాంతి, బత్తిన వాసు, బి.సింహాద్రి, దశరథ, రాజాం గుణవంతు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుణ్యక్షేత్రాలకు వెళ్లొస్తూ..

• రైల్లో వ్యక్తి మృతి

పార్వతీపురం టౌన్‌: పుణ్య క్షేత్రాలను సందర్శించి తిరిగి ఇంటికి వస్తుండగా ఓ ప్రయాణికుడు రైల్లో గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. విశాఖ జిల్లా పెందుర్తిలోని నూకాలమ్మ గుడి ప్రాంతానికి చెందిన కొందరు పుణ్యక్షేత్రాలకు వెళ్లారు. వీరిలో రాళ్లపల్లి సత్యనారాయణ (63), ఆయన భార్య మణి ఉన్నారు. వీరంతా తిరుగు ప్రయాణంలో భాగంగా ఢిల్లీలో సమతా ఎక్స్‌ప్రెస్‌ ఎక్కారు. టిట్లాఘడ్‌ వచ్చే సరికి సత్యనారాయణ అస్వస్థతకు గురికావడంతో అక్కడే దిగిపోయి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కొంచెం నయం కావడంతో నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి బయలుదేరారు. పార్వతీపురం సమీపానికి వచ్చే సరికి తీవ్ర అస్వస్థతకు గురై గుండె నొప్పితో ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది జీఆర్పీ పోలీసులకు తెలియజేశారు. సత్యనారాయణ భార్య మణి నుంచి వివరాలు సేకరించి మృతదేహాన్ని అత్యవసర వాహనంలో పెందుర్తి తరలించినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

చెట్టు నుంచి జారిపడి ఒకరి మృతి

శృంగవరపుకోట: మండలంలోని గోపాలపల్లి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు ప్రమాదవశాత్తూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. ఎస్సై గంగరాజు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వనం సంతోష్‌ (36) కల్లు తీయడానికి ఈత చెట్టు ఎక్కాడు . అయితే ప్రమాదవశాత్తూ పట్టుజారి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు ఎస్‌.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పక్కాగా రిజిస్టర్ల నిర్వహణ

• డీఈఓ ప్రేమ్‌కుమార్‌

మెరకముడిదాం: ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న పాఠ్య పుస్తకాలు, నోట్‌ పుస్తకాలు, యూనిఫామ్‌లు, షూష్‌, సాక్సులకు సంబంధించిన రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని డీఈఓ ఎస్‌.ప్రేమ్‌కుమార్‌ ఆదేశించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉన్న స్టాక్‌ పాయింట్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రిజిస్టర్లలో మొదటి పేజీలో మండలానికి చెందిన ఇండెంట్‌ వివరాలు నమోదు చేసి, తర్వాత పేజీల్లో స్టాకు వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ -1 చంద్రశేఖర్‌, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరిపై లక్ష్మీనరసింహ స్వామి అనుగ్రహం

• డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి



లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రత్యక్ష దైవంగా భాసిల్లుతున్న పెంచల లక్ష్మీ నరసింహస్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరిపైనా ఉండాలని డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. నెల్లూరు జిల్లా రాపూరి మండలం పెంచలకోనలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామిని సోమవారం ఉదయం ఆయన దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వెంకటాచలం మండలం గొలగమూడిలో వేంచేసిన వెంకయ్యస్వామి పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుని అవధూత ఆశీస్సులు పొందారు. ఆయన రాకను పురస్కరించుకుని ఆలయ పండితులు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన లక్ష్మీనరసింహస్వామి స్థల పురాణాన్ని ఆలయ పురోహితులు కోలగట్లకు వివరించారు. అలాగే గొలగమూడిలో అవధూత వెంకయ్యస్వామి మహిమలను అక్కడ ఉన్న ఆలయ ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో పైడితల్లమ్మ దేవస్థానం ట్రస్ట్‌ బోర్డు మెంబర్‌ ఎంకేబీ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీల ఆదాయం రూ.5,00,435



అమ్మవారి హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

చీపురుపల్లి: పట్టణంలోని భక్తుల ఇలవేల్పు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీల ఆదాయం రూ.5,00,435 లభించినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జి.శ్రీనివాస్‌ చెప్పారు. అమ్మవారి ఆలయ మంటపంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌, రామతీర్థం కార్యనిర్వహణాధికారి రామస్వామి ఆధ్వర్యంలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. 2024 మార్చి 20 నుంచి 2024 మే 27 వరకు హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.5,00,435 ఆదాయం లభించింది. కేవలం రెండు నెలల కాలంలో రూ.5 లక్షలకు పైగా హుండీల ద్వారా ఆదాయం లభించడంతో భక్తుల రద్దీ పెరిగిందని దేవాదాయశాఖ భావిస్తోంది.

నేలకు నవ వసంతం...



నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు (ఫైల్‌)

• నవధాన్యాల సాగుతో భూమి సారవంతం
• రసాయన ఎరువుల వినియోగం తగ్గించేందుకు కృషి
• జిల్లాలో 94 వేల ఎకరాల్లో సాగు లక్ష్యం



నవధాన్యాల విత్తనాలు



పంటల ప్రదర్శన (ఫైల్‌)

సీతంపేట/విజయనగరం ఫోర్ట్‌: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ దిశగా రైతులను చైతన్య పరుస్తున్నారు. రసాయన ఎరువులు అధికంగా వినియోగించడం వల్ల భూములు సారం కోల్పోతాయని... దీంతో భూసారం పెంచుకోవాల్సిన బాధ్యత అన్నదాతలపై ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రేపటి తరానికి సారవంతమైన భూములు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, రైతులను ప్రోత్సహిస్తున్నారు.

94 వేల ఎకరాల్లో సాగే లక్ష్యం..

ఖరీఫ్‌ అనంతరం ఖాళీగా ఉన్న పంట చేలల్లో పచ్చిరొట్ట బదులు నవధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలోని 15 మండలాల్లో 94 వేల ఎకరాల్లో నవధాన్యాల సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయా మండలాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఇప్పటికే రైతుల నుంచి ఆమోదం తీసుకుని విత్తన గుళికలు తయారు చేసి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొక్కజొన్న, జొన్న, మినుములు, పెసలు, ఉలవలు, చోడి, జీలుగు, జనుము, గోంగూర, తోటకూర, కొత్తిమీర, బీర, ఆనప, ఉదలు, కొర్రలు, తదితర విత్తనాలను నవధాన్యాలుగా పంటపొలాల్లో చల్లుతారు. 12 కిలోల విత్తన గుళికలను బంక మట్టితో కలిపి చల్లి, ఘన జీవామృతం పిచికారీ చేస్తారు. విత్తనాలను బంకమట్టితో కలిపి గుళికల రూపంలో వేయడం వల్ల పక్షులు తినడానికి వీలుండదు. దీంతో చల్లిన ప్రతి గింజా మొలకెత్తుతుంది.

పశువులకు మేతగా...

40 నుంచి 45 రోజుల పాటు ఏపుగా ఎదిగే నవధాన్యాలపై పంటను కోసం పశువులకు మేతగా ఉపయోగించవచ్చు. దీంతో పాడి బాగా అభివృద్ధి చెందుతుంది. పంటను పశువులకు వినియోగించగా... భూమిలోపల మిగిలిన దుబ్బులను ట్రాక్టర్‌తో కలియదున్నడం వల్ల భూమి గుల్లబారి, నీటి నిల్వ సామర్థ్యం పెరిగి సూక్ష్మపోషకాలు వృద్ధి భూసారం పెరుగుతుంది.

బీజామృతం తయారీ ఇలా...

దేశీ ఆవుపేడను పలచటి గుడ్డలో మూటకట్టి 20 లీటర్ల నీరు ఉన్న తొట్టిలో 12 గంటలు ఉంచాలి. ఒక లీటర్‌ నీటిని వేరే పాత్రలో తీసుకుని 50 గ్రాముల సున్నం కలిపి రాత్రంతా ఉంచి ఉదయాన్నే నానబెట్టిన పేడ మూటను చేతితో పిండి రసాన్ని నీటి తొట్టిలో కలపాలి. ఇలా వచ్చిన ద్రావణాన్ని 12 గంటల పాటు నిల్వ ఉంచి మరునాడు విత్తనాలకు పట్టించి నీడలో ఆరబెట్టి నాటితే ఏ రకమైన చీడపీడలు రాకుండా విత్తనాలు మొలకెత్తుతాయి.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



గ్రామసభలు ఏర్పాటు చేసి వీఓ, ఎస్‌హెచ్‌జీలు, ఆర్‌బీకేల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం . తొలకరి వర్షాలకు రైతులు నవధాన్య విత్తన గుళికలు పంట పొలాల్లో చల్లడం ద్వారా పచ్చిరొట్ట తయారవుతుంది. 40 రోజుల్లో మొలకెత్తిన పంట ఏపుగా పెరిగి, పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది. అలాగే భూమి సారవంతమవుతుంది.

– పి.షణ్ముకరాజు, డీపీఎం, ప్రకృతివ్యవసాయం

అధిక దిగుబడులు



నవ ధాన్యాలు వేయడం వల్ల పంటల దిగుబడి పెరుగుతుంది. ఎరువుల వాడకం తగ్గుతుంది. గత సంవత్సరం మంచి ఫలితాలు వచ్చాయి. మొక్కలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు పెరుగుతాయి. ఘన, ద్రవ జీవామృతాలు వేసుకుంటే ఇంకా మంచి ఫలితాలు వస్తాయి. ఈ తరహాలో సాగు చేసి మంచి దిగుబడులు సాధిస్తున్నాను.

– శ్రీనివాసరావు, రైతు, దిబ్బగూడ

కట్టుకున్నోడే కడతేర్చాడు

• మాట వినడం లేదన్న అక్కసుతో అంతం చేశాడు..
• ఆలస్యంగా వెలుగులోకి..



కల్యాణి మృతదేహం



మృతురాలు గొగ్గి దారప్పు (కల్యాణి)



నిందితుడు చీమల కనకారావు

శృంగవరపుకోట: జీవితాంతం తోడుంటానని ప్రమాణం చేసిన భర్తే కాలయముడయ్యాడు. మూడేళ్ల ముచ్చటగా సాగిన వీరి సంసారానికి సాక్ష్యంగా ఉన్న ఏడాది వయసున్న చిన్నారి ఇటు తల్లి కానరాని లోకాలకు పోగా.. అటు తండ్రి కటకటాల పాలవ్వడంతో అనాథగా మిగిలాడు. మండలంలోని బొడ్డవర పంచాయతీ పరిధిలో చోటుచేసుకున్న ఈ హత్యోదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. మృతురాలి తల్లి రామకృష్ణమ్మ, ఎస్‌.కోట సీఐ మురళీరావు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. ఒడ్డు మరుపల్లి గ్రామానికి చెందిన గొగ్గి దారప్పు ఉరఫ్‌ కల్యాణిని అదే గ్రామానికి చెందిన చీమల కనకారావు ప్రేమించి, మూడేళ్ల కిందట పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నాడు వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. కల్యాణి (22) ఇటీవల లచ్చందొరపాలెంలో ఒక హోటల్‌లో పనికి చేరింది. ఇది నచ్చని భర్త కనకారావు పని మానేయాలని కల్యాణిపై ఒత్తిడి తీసుకువచ్చాడు. ఆమె భర్త మాట వినకపోవడంతో ఆరు నెలలుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో కల్యాణి తన అమ్మగారింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో కనకారావు ఆదివారం ఉదయం అత్తగారింటికి వెళ్లి భార్యను బాగా చూసుకుంటానని చెప్పి తీసుకెళ్లాడు. అదేరోజు భార్యను గ్రామ సమీపంలోని మామిడితోటకు తీసుకెళ్లి గొడవపడ్డాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో కనకారావు సహనం కోల్పోయి కల్యాణి మెడలో ఉన్న చున్నీ బిగించి ఆమెను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని లచ్చందొరపాలెం రైల్వేబ్రిడ్జి సమీపంలో ఉన్న తుప్పల్లో విసిరేశాడు. సాయంత్రం కనకారావు ఒక్కడే ఇంటికి చేరడంతో కల్యాణి తల్లికి అనుమానం వచ్చి గట్టిగా నిలదీయడంతోర హత్య విషయం బయటకు వచ్చింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు సీఐ మురళీధర్‌ సంఘటనా స్థలానికి వెళ్లి తహసీల్దార్‌ కిరణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో శవ పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్‌.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హింసాత్మక సంఘటనలు జరగకుండా చర్యలు

• ఏఆర్‌ డీఎస్పీ వెంకట అప్పారావు



ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఆవరణలో మాక్‌ డ్రిల్‌ నిర్వహిస్తున్న పోలీసులు


పార్వతీపురం టౌన్‌: రానున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో హింసాత్మక సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టామని ఏఆర్‌ డీఎస్పీ ఎస్‌. వెంకట అప్పారావు అన్నారు. ఎస్పీ విక్రాంత్‌ పాటిల్‌ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మైదానంలో సోమవారం 'మాబ్‌ ఆపరేషన్‌' మాక్‌ డ్రిల్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లరి మూకలు విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో శాంతి భద్రతలకు విఘాతం వాటిల్లకుండా, సమయస్ఫూర్తితో స్పందించి జన సమూహాలను నియంత్రించడమే లక్ష్యంగా మాక్‌డ్రిల్‌ నిర్వహించినట్లు చెప్పారు. అంతకుముందు వాహనాలపై వచ్చిన జన సమూహాలను కంట్రోల్‌ చేయడం.. భాష్ప వాయువు ప్రయోగించడం.. లాఠీచార్జ్‌, ప్లాస్టిక్‌ పెల్లెట్స్‌ ఫైరింగ్‌ చేయడం.. వంటి సన్నివేశాలను డెమో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

అమలులో 144 సెక్షన్‌, పోలీస్‌ యాక్ట్‌ 30

జిల్లాలో 144 సెక్షన్‌, 30 పోలీస్‌ యాక్ట్‌ అములులో ఉన్నందున శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఏఆర్‌ డీఎస్పీ వెంకట అప్పారావు అన్నారు. కౌంటింగ్‌ ముగిసేంత వరకు ప్రజలు సంయమనం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఏఎస్పీ సునీల్‌ షరోన్‌, ఆర్‌ఐలు శ్రీరాములు, శ్రీనివాసరావు, సీఐ కృష్ణారావు, ఎస్సై రవీంద్ర రాజు, ఆర్‌ఎస్సైలు , తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌ కేంద్రాల్లో తెలుగులో సూచిక బోర్డులు


• అధికారులకు కలెక్టర్‌ ఆదేశాలు



లెండి కళాశాలలో కౌంటింగ్‌ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్‌ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్‌: ఓట్ల లెక్కింపు కోసం జిల్లా కేంద్రంలోని లెండి ఇంజినీరింగ్‌ కళాశాల, జెఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో రాజకీయ పార్టీల ఏజెంట్లు సులువుగా ఆయా నియోజక వర్గాల లెక్కింపు జరిగే ప్రదేశాలను గుర్తించేందుకు తెలుగులో సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ ఎస్‌.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. అన్ని ఓట్ల లెక్కింపు హాల్‌లలో ఏసీ సౌకర్యం ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లా కేంద్రంలోని లెండి ఇంజినీరింగ్‌ కళాశాలలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను కలెక్టర్‌ నాగలక్ష్మి సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ఏజెంట్లు, కౌంటింగ్‌ సిబ్బందికి అవసరమైన వసతుల కల్పన ఏర్పాట్లు వేగవంతం చేయాలని రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాలను స్ట్రాంగ్‌ రూమ్‌ నుంచి ఓట్ల లెక్కింపు హాల్‌కు తరలించేటప్పుడు సీసీ కెమెరాల ద్వారా రికార్డు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని వాటిని అమరుస్తున్న ఏజెన్సీ ప్రతినిధిని ఆదేశించారు. పత్రికా, మీడియా ప్రతినిధులకు మీడియా సెంటర్‌ ఏర్పాటుపై ఆరా తీశారు. ఈ పర్యటనలో డీఆర్‌ఓ ఎంవీ సూర్యకళ, మెప్మా పీడీ సుధాకర్‌, ఆర్‌అండ్‌బీ ఈఈ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత జడ్జి మృతిపై సంతాపం



మోహన్‌కుమార్‌ (ఫైల్‌)

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విశ్రాంత జడ్జి మోహన్‌కుమార్‌ మృతి పట్ల న్యాయవాదుల సంఘం తీవ్ర సంతాపం వెలిబుచ్చింది. ఆయన మరణవార్త తెలుసుకున్న న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు అల్లాడ హరీష్‌ ప్రదీప్‌నగర్‌లో ఉన్న మోహన్‌కుమార్‌ ఇంటికి సోమవారం ఉదయం హుటాహుటిన చేరుకుని ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోహన్‌కుమార్‌ మృతి తీరని లోటన్నారు. సౌమ్య స్వభావి అయిన మోహన్‌కుమార్‌ జిల్లా కేంద్రంలో ఏపీపీగా పనిచేశారని తెలిపారు. అలాగే జిల్లా వినియోగదారుల ఫోరం చైర్మన్‌గా పదవులు నిర్వహించారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సంఘ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అధ్యక్షుడు హరీష్‌తో పాటు మాజీ అధ్యక్షుడు చొక్కాపు దాము, సీనియర్‌ న్యాయవాదులు ఎస్‌ఎస్‌ఎస్‌వీఆర్‌ఎం రాజు, కె.ఫల్గుణరావు, పి. అప్పలనాయుడు ఉన్నారు.

రామవరంలో రోడ్డు ప్రమాదం..

కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోహన్‌కుమార్‌తో పాటు ఆయన కారు డ్రైవర్‌ శ్రీను మృతి చెందిన విషయం తెలిసిందే. మోహన్‌కుమార్‌ స్వస్థలం పార్వతీపురం. న్యాయవాద వృత్తి చేపట్టిన తర్వాత పార్వతీపురంలో ప్రాక్టీస్‌ ప్రారంభించారు. అనంతరం అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా ఎంపికయ్యారు. బొబ్బిలి, విజయనగరంలలో పనిచేశారు. తర్వాత జూనియర్‌ సివిల్‌ జడ్జిగా పని చేశారు. పదోన్నతిపై ప్రకాశం జిల్లా అదనపు జిల్లా జడ్జిగా పని చేసి అక్కడే పదవీ విరమణ చేశారు. అనంతరం విజయనగరం జిల్లా వినియోగదారుల ఫోరం చైర్మన్‌గా మూడేళ్ల పాటు పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను ఆంధ్రప్రదేశ్‌ రియల్‌ ఎస్టేట్‌ రెగ్యులేటరీ అథారిటీ (రేరా) ఎడ్యుకేటింగ్‌ అధికారిగా నియమించింది. ప్రస్తుతం ఆయన విజయవాడ కేంద్రంగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. విజయనగరం నుంచి కారులో విజయవాడ వెళుతున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది.

రక్తదాతల సేవానిరతి గొప్పది..

• జెడ్పీ చైర్మన్‌ మజ్జి శ్రీనివాసరావు
• రక్తదానం చేసిన 273 మంది యువత



మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్‌ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడడంలో రక్తదాతల సేవానిరతి గొప్పదని విజయనగరం జిల్లా పరిషత్‌ చైర్మన్‌, వైఎస్సార్‌సీపీ రీజనల్‌ డిప్యూటీ కో ఆర్డినేటర్‌ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. అందరి అభిమానంతో డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. కోలగట్ల జన్మదినోత్సవంలో భాగంగా వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక సుజాత ఫంక్షన్‌ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించగా... సుమారు 273 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దాతలకు జెడ్పీ చైర్మన్‌ మజ్జి శ్రీనివాసరావు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం కోలగట్ల జన్మదినం సందర్భంగా పార్టీ శ్రేణులు, అభిమానులు ప్రజోపయోగ సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్‌ ఫ్లోర్‌లీడర్‌ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్‌ సంగంరెడ్డి బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, జోనల్‌ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు, కోలగట్ల అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం





హాజరైన మైక్రో అబ్జర్వర్లు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న జాయింట్‌ కలెక్టర్‌ కార్తీక్‌

విజయనగరం అర్బన్‌: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్లను లెక్కించే ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకమని జాయింట్‌ కలెక్టర్‌ కె.కార్తీక్‌ అన్నారు. కౌంటింగ్‌లో పాల్గొనే మైక్రో అబ్జర్వర్లకు కలెక్టరేట్‌ ఆడిటోరియంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... మైక్రో అబ్జర్వర్ల విధులు, బాధ్యతలను వివరించారు. లెక్కింపు కేంద్రాల్లోని ప్రతి టేబుల్‌ వద్దా మైక్రో అబ్జర్వర్‌ను నియమించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్‌ నిబంధనల మేరకు కౌంటింగ్‌ ప్రక్రియ జరిగేలా చూడాల్సిన బాధ్యత వీరిపై ఉందని తెలిపారు. ఏమైనా తేడాలను గుర్తిస్తే వెంటనే పరిశీలకులు, రిటర్నింగ్‌ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కౌంటింగ్‌ సూపర్‌వైజర్లు, ఇతర లెక్కింపు సిబ్బంది ప్రతీ రౌండ్‌కు పోలైన ఓట్ల వివరాలను ఆర్‌ఓలకు అందజేస్తారని.. ఇదే సమయంలో మైక్రో అబ్జర్వర్లు ఓట్ల వివరాలను అబ్జర్వర్లకు అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. లెక్కింపు ప్రక్రియలో ప్రతీ దశ కీలకమైనని స్పష్టం చేశారు. కౌంటింగ్‌ సిబ్బందిని, ఏజెంట్లను గమనించాల్సిన బాధ్యత వీరిపై ఉందన్నారు. ఆర్‌లో టేబుల్‌ దగ్గర నియమితులయ్యే ఇద్దరు మైక్రో అబ్జర్వర్లు రౌండుల వారీగా ఓటర్ల వివరాలు నమోదు చేయాలన్నారు. ట్రైనింగ్స్‌ నోడల్‌ అధికారి సుధాకరరావు మైక్రో అబ్జర్వర్ల విధులను పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా వివరించారు. కౌంటింగ్‌లో తలెత్తే న్యాయపరమైన అంశాలు, కౌంటింగ్‌ కేంద్రం, దానిలో ఏర్పాటు చేసే టేబుళ్లు, ప్రతీ టేబుల్‌కు నియమితులయ్యే సిబ్బంది, పోస్టల్‌ బ్యాలెట్‌ కవర్ల పరిశీలన, నిరాకరణ, లెక్కింపు, ఈవీఎంలో ఓట్ల లెక్కింపు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ఎన్నికల సెల్‌ సూపరింటెండెంట్‌ ప్రభాకర్‌, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లోయలో పడిన ఆటో



క్షతగాత్రులను అంబులెన్స్‌లో శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం

• బాలుడి మృతి
• 16 మందికి తీవ్రగాయాలు
• ముగ్గురి పరిస్థితి ఆందోళనకరం
• వారపు సంత నుంచి ఇంటికి వెళ్తుండగా ప్రమాదం



సీతంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



నుజ్జునుజ్జయిన ఆటో



మృతిచెందిన కార్తీక్‌

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట ఏజెన్సీలో వంబరెల్లి ఘాట్‌రోడ్‌ వద్ద లోయలో సోమవారం ఒక ఆటో బోల్తా పడి ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 17 మందికి తీవ్రగాయాలు కాగా క్షతగాత్రుల్లో సవర కార్తీక్‌ (8) అనే బాలుడు మృతిచెందాడు. మరో ఇద్దరి పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్‌ చేశారు. ఈ ప్రమాద సంఘటన వివరాలిలా ఉన్నాయి. సీతంపేట మండలంలోని వంబరెల్లి, దీనరిగూడ, బుడ్డడుగూడ పరిసర గ్రామాలకు చెందిన గిరిజనులు సీతంపేటలో జరిగే వారపు సంతకు వచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుని తిరుగు ప్రయాణంలో ఒకే ఆటోలో 17 మంది ప్రయాణిస్తున్నారు. వంబరెల్లి రహదారి పూర్తిగా ఘాట్‌ రోడ్‌ కావడంతో ఆటో పైకి కొండ ఎక్కుతున్న సమయంలో డ్రైవర్‌ అదుపు చేయలేకపోవడంతో వెనక్కువచ్చి వంద అడుగుల లోయలో పడింది. దీంతో ఆటో నుజ్జునుజ్జయింది. ఒక్కసారిగా ప్రయాణికులంతా హాహాకారాలు చేశారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఒకరు దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. సవర లక్ష్మి, సవరకార్తీక్‌, డొంబయ్య, అనిత, కవిత, సుక్కమ్మ, తిక్కమ్మ, అడ్డాయి, బెన్నయ్య, ఉషా, తుంపమ్మ, లాస్య, నవీన్‌, సుక్కమ్మ, రమణ, మదు, సాంబయ్యలకు గాయాలయ్యాయి. వారిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా ప్రధాన వైద్యాధికారి శ్రీనివాసరావు, సివిల్‌ సర్జన్‌ శ్రీనివాసరావు, రాజేష్‌ తదితరులు ప్రాథమిక వైద్యసేవలందించారు. క్షతగాత్రుల పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో 11మంది, జెమ్స్‌ ఆస్పత్రిలో ఇద్దరు, పాలకొండలో ఒకరు, సీతంపేట హాస్పిటల్‌లో ముగ్గురు చికిత్స పొందుతున్నారు. జెమ్స్‌లో చికిత్స పొందుతున్న కార్తీక్‌ మృతి చెందాడు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సవర లక్ష్మి, సవర అనిత, మరొకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

అలుముకున్న విషాదఛాయలు

ఆటోలోయలో పడిన విషయం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు భారీ ఎత్తున సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రత్యేక వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

ఆటోలోయలో పడి 17 మందికి గాయాలపాలైన సంఘటన తెలుసుకున్న ఎస్టీ కమిషన్‌ రాష్ట్ర చైర్మన్‌ డీవీజీ శంకరరావు, పాలకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతిలు స్పందించారు. ఆటో ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభంబన్సల్‌తో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించే విధంగా చూడాలని కోరారు. సీతంపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌, శ్రీకాకుళం రిమ్స్‌, జెమ్స్‌ ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని కోరారు. ఎంపీపీ బి.ఆదినారాయణతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు సీతంపేట ఏరియా ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు.